క్లుప్తంగా

నిధుల స్వాహా పై చర్యలేవి?

మదనపల్లె: మదనపల్లె మున్సిపాలిటిలో 2022–23లో గుత్తలకు సంబంధించి లీజదారు చెల్లించిన రూ.29.50 లక్షల సొమ్ము స్వాహాపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబ శివ బుధవారం ఒక ప్రకటనలో అధికారులను ప్రశ్నించారు. చేతిరాతతో రశీదులు ఇచ్చిన వ్యవహారంపై ఎందుకు విచారించడం లేదో అధికారులు చెప్పాలని డిమాండ్ చేశారు. స్వాహా చేసిన వారిపై ఎందుకు శాఖాపరమైన చర్యలు చేపట్టలేదని ప్రశ్నించారు. వసూలైన గుత్తల సొమ్ము జమ చేయకపోవడంపై కమీషనర్ ప్రజలకు వాస్తవాలు వెల్లడించాలని కోరారు.

హెచ్ఐవీ నివారణపై అవగాహన



పీలేరు ఆర్టీసీ బస్టాండులో కళాజాత బృందం

పీలేరు : హెచ్ఐవీ /ఎయిడ్స్ నివారణపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కోర్ సంస్థ ఓఆర్డబ్ల్యూ రాజమ్మ అన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, కోర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కేసీ నటరాజ్ కళాబృందం కళాజాత ద్వారా హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. హెచ్ఐవీ, క్షయవ్యాధి సంబంధం, సుఖవ్యాధులు, చికిత్స గురించి వివరించారు. హెచ్ఐవీ /ఎయిడ్స్ యాక్టు 2017 గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శైలజ, పీఈలు మల్లీశ్వరి, మునీశ్వరి, అనిత పాల్గొన్నారు.

జూన్ 3 నుంచి టీచర్లకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ



సౌకర్యాలపై ఆరా తీస్తున్న సర్వశిక్షా అభియాన్ ప్రతినిధులు

పీలేరు : సెకండీ గ్రేడ్ ఉపాధ్యాయులకు జూన్ 3 వ తేదీ నుంచి ఆరు రోజుల పాటు ఫౌండేషన్ ఆఫ్ లిటరసీ అండ్ న్యూమరాసి (ఎఫ్ఎల్ఎన్) శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సర్వ శిక్షా అభియాన్ ప్రతినిదులు చాణక్యరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లాలో పీలేరు, మదనపల్లె, రాయచోటి, రాజంపేటలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా పీలేరులో ఎఫ్ఎల్ఎన్ శిక్షణా కార్యక్రమం నిర్వహించడానికి స్థానిక శ్రీభువన విద్యాలయం ఎంపిక చేశారు. బుధవారం సర్వ శిక్షా అభియాన్ ప్రతినిదులు భువన విద్యాలయాన్ని సందర్శించి సౌకర్యాలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 500 మంది ఉపాధ్యాయులకు ఇక్కడ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీ భువన విద్యాలయం ప్రిన్సిపాల్ గుణలక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికులపై 'మహా 'దెబ్బ

-మహానాడుకు ఆర్టీసీ బస్సులు
-ప్రయాణికులకు తప్పని తిప్పలు



మదనపల్లె సిటీ: టీడీపీ మహానాడు దెబ్బ ఆర్టీసీ ప్రయాణీకులపై పడనుంది. మంగళవారం కడపలో మహానాడు ప్రారంభం కాగా, గురువారం ముగింపు సభ జరగనుంది. ఇందు కోసం భారీగా జనసమీకరణ చేయాలని టీడీపీ నేతలు భావించారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జ్‌లకు బాధ్యతలు అప్పగించారు. అయితే జనాన్ని తరలించేందుకు ప్రైవేటు వెచ్చించాల్సి వస్తుందని భావించిన తెలుగు తమ్ముళ్లు ఆర్టీసీ బస్సులపై దృష్టి సారించారు. జిల్లాలోని అయిదు డిపోల నుంచి దాదాపు 75 శాతం బస్సులను మహానాడుకు సిద్ధం చేశారు. మదనపల్లె వన్ డిపో నుంచి 80, టు డిపో నుంచి 60 బస్సులు మహానాడుకు బుక్ చేశారు. మదనపల్లె రెండు డిపోల నుంచి కేవలం హైదరాబాదు,విజయవాడ, చెన్నై, తిరుపతి ఎలక్ట్రిక్ బస్సులు,, అద్దెబస్సులు మాత్రం నడుస్తాయి. మిగిలిన సర్వీసులన్నీ మహానాడుకు తరలిపోనున్నాయి.

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

మహానాడుకు అత్యధికంగా ఆర్టీసీ బస్సులనే వాడుకోవడం కూటమి ప్రభుత్వ అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అని ప్రయాణికులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో వందలాది ప్రైవేటు బస్సులు, వాహనాలు ఉన్నా ఆర్టీసీ బస్సులను మహానాడుకు వినియోగించుకోవడం ప్రయాణికులను ఇబ్బంది పెడ్డడమేనని వాపోతున్నారు.

31న ములకలచెరువులో జాబ్‌మేళా

రాయచోటి జగదాంబసెంటర్ : ఈ నెల 31వ తేదీన జిల్లాలోని ములకలచెరువులోని బ్లాసమ్ డిగ్రీ కళాశాలలో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కార్యకర్తల సంక్షేమం, బాగోగులు చూస్తాం



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఏపీఎండీసీ మాజీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం

- పేరుపేరునా ఆప్యాయంగా పలుకరించిన మాజీ ముఖ్యమంత్రి జగన్
- ఫొటోలు తీసుకుని ఆనందం వ్యక్తం చేసిన మున్సిపల్ కౌన్సిలర్లు
- రానున్న మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు ధ్యేయంగా పనిచేయాలని ఆదేశాలు
- పార్టీ బలోపేతంపై నాయకులతో విస్తృతచర్చలు, పలు సూచనలు

మదనపల్లె రూరల్ : వైఎస్సార్ సీపీ అధినేత, జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో బుధవారం మదనపల్లె నాయకులు సమావేశమయ్యారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల భేటీలో భాగంగా తాడేపల్లి పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, ఏపీఎండీసీ మాజీ చైర్‌పర్సన్ షమీంఅస్లాంతో కలిసి 28 మంది కౌన్సిలర్లు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి.. మాజీ ముఖ్యమంత్రి జగన్ మాట్లాడుతూ... ఈసారి అధికారంలోకి వచ్చాక కార్యకర్తలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంతో పాటుగా కార్యకర్తల బాగోగులు చూస్తామన్నారు. టీడీపీ పాలనలో కార్యకర్తలకు జరుగుతున్న ప్రతి కష్టం, అన్యాయాన్ని గమనిస్తున్నామని.. అన్యాయం ఎవరు చేసినా..మీకు ఇష్టం వచ్చిన పుస్తకంలో రాసుకోండి..మనం వచ్చిన తర్వాత కచ్చితంగా వడ్డీతో సహా రిటర్న్ గిఫ్ట్‌లు ఇస్తామంటూ నాయకులందరిలో భరోసా నింపారు. అనంతరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్‌ను అప్యాయంగా పలుకరించి, నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులపై నాయకులందరితో చర్చించారు. సమావేశానికి హాజరైన ప్రతి ఒక్కరినీ పేరుపేరునా అప్యాయంగా పలుకరించి, వ్యక్తిగతంగా ఫొటోలు దిగడంతో నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికలపై ఇప్పటి నుంచే దృష్టి పెట్టాలని, గెలుపే లక్ష్యంగా పనిచేయాలని వైఎస్సార్ సీపీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. వైఎస్సార్ సీపీ బలోపేతానికి పలు సూచనలు, సలహాలు అందించారు. భవిష్యత్తులో వచ్చేది మన ప్రభుత్వమేనని, కార్యకర్తలు, నాయకులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా పార్టీ పటిష్టతకు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, మున్సిపల్ వైస్‌చైర్మన్ నూర్‌ఆజం, చేనేతవిభాగం నాయకులు శీలంరమేష్, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పార్టీ పదవుల్లో యువతకు పెద్దపీట

-మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



గంగాపురంలో పార్టీ నాయకులతో కలిసి మాట్లాడుతున్న మాజీ పీలేరు ఎమ్మెల్యే చింతల

కలకడ : వైఎస్సార్ సీపీ రాష్ట్ర వ్యాప్తంగా కేటాయించిన పార్టీ పదవుల్లో యువతకు ప్రాధాన్యత ఇచ్చి, పెద్దపీట వేసి ప్రోత్సహించిందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల.రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం కలకడ మండలం గంగాపురంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా పేదప్రజల ఆశలు ఆవిరి అయ్యేవిధంగా వాయిదాల పద్ధతిని అవలంబిస్తుందని ఎద్దేవచేశారు. అన్నివర్గాలకు అన్యాయమే జరుగుతోందన్నారు. కక్ష సాధింపులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. ఇది ఎంతో కాలం సాగదన్నారు. పార్టీ పరంగా అందరూ కలిసి కట్టుగా అన్యాయంపై మాట్లాడాలన్నారు. న్యాయం చేయడానికి కోర్టులు ఉన్నాయని, ఎవ్వరు అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. అందరికీ అందుబాటులో ఉంటామని, ఎంపీ పివి మిథున్‌రెడ్డి, మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో కలిసి ప్రకార్యకర్తకు న్యాయం చేయడానికి కృషి చేస్తానన్నారు. యువత గ్రామీణ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. మండల సోషియల్ మీడియ కోఆర్డినేటర్ వెంకటేశ్వరనాయుడు శాలువాతో సన్మానించి పార్టీలో సముచిత స్థానం కలిపించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గంగాపురం గ్రామానికి చెందిన బాలినేని శీనయ్యనాయుడు చిత్రపటం వద్ద నివాళ్ళు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కన్వీనర్ కమలాకర్ రెడ్డి, పీలేరు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషు, నాయకులు శ్రీనివాసులురెడ్డి, కెఎస్‌మస్తాన్‌మహమ్మద్, ప్రదీప్‌రెడ్డి, శివారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్వర నాయుడు, లక్ష్మన్న, రవి, కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గుర్రప్ప, జాఫర్, ఆనంద, అంజన్‌కుమార్,వెంకట్రమణ, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కలికిరి(వాల్మీకిపురం): ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాలని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వాల్మీకిపురం మండల నూతన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా అధ్యక్షుడు రాజా బాబుకు సూచించారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే చింతలను కలిసిన రాజాబాబు ఆయన్ను దుశ్శాలువాతో సన్మానించి, తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతపై విధిగా పని చేస్తానన్నారు. పార్టీ నియోజకవర్గ ప్రచార కమిటి అధ్యక్షుడు ఆనంద, నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు నీళ్ళ భాస్కర్, మండల పార్టీ కన్వీనర్ పులి శివకుమార్‌రెడ్డి, వాల్మీకిపురం ఉప సర్పంచ్ బిడ్డల కేశవ రెడ్డి, రవి, మేస్త్రీ చిన్నోడు, రఘు, సుధాకర, శేఖర్ నాయుడు, పట్టాభి, నాగార్జున, చలపతి తదితరులు పాల్గొన్నారు.

తిరోగమనంలో కూటమి ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : ఉచిత హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తిరోగమనంలో పయనిస్తోందని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వేపులబైలు పంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు రత్నశేఖర్ రెడ్డి మాతృ వియోగం పొందడంతో, ఆయన తల్లి సరోజమ్మ చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి అనేక అడ్డదారులు తొక్కిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక చేతులెత్తేశారని ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడం పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. అధికారం ఏ పార్టీకి శాశ్వితం కాదని, గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు దండు జగన్‌మోహన్‌రెడ్డి, హబీబ్‌బాషా, చెంగల్‌రాయుడు, ఎంపీటీసీ మధుసూదన్‌రెడ్డి, నాయకులు జి. సురేందర్‌రెడ్డి, సీకే వెంకటేష్, లోకనాథరెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, చక్రదర్, అబీద్, కాలనీ చిన్న, మునీర్, యర్రమరెడ్డి, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఫోర్డు డైరెక్టర్ లలితమ్మ

మదనపల్లె సిటీ: పరిశుభ్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఫోర్డు డైరెక్టర్ లలితమ్మ అన్నారు. బుధవారం మదనపల్లె మండలం ఆరోగ్యవరంలోని నర్సింగ్ కాలేజీలో రుతుచక్ర పరిశుభ్రత దినోత్సం సందర్భంగా నర్సింగ్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుటుంబ సభ్యులకు దూరంగా ఉండటం వంటి మూఢనమ్మకాలను విడనాడాలని సూచించారు. అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ ప్యాడ్స్‌ను వినియోగించాలన్నారు. రుతుస్రావమయ్యే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నెలసరి అనేది ప్రపంచంలో ప్రతి స్త్రీలో జరుగుతుందన్నారు. ఈ విషయంలో ఎవ్వరూ భయపడవద్దు, సిగ్గుపడవద్దని తెలిపారు. ఈ విషయంలో ఎవరికైనా సందేహాలు ఉంటే గైనకాలజిస్టును సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి సైక్రాయాటిస్టు డాక్టర్ రాధిక, న్యాయవాది రమాదేవి, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ టోనీ, గాయిత్రి, ఫోర్డు సభ్యులు నరసింహ, జయలక్ష్మి, స్వర్ణ, జలజ,సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి కన్నా చదువు గొప్పది



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి

మదనపల్లె సిటీ: ఆస్తుల కన్నా చదువు గొప్పదని అపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి అన్నారు. బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో స్థానిక మదనపల్లె జూనియర్ కాలేజీ వేసవి ఉచిత స్పోకెన్ ఇంగ్లీషు తరగతుల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు బాగా చదువుకుని సమాజం , దేశం గురించి ఆలోచించాలన్నారు. దేశ భవిష్యత్తు విద్యార్థులపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఏబీవీపీ ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఏబీవీపీ రాష్ట్ర పాఠశాలల కన్వీనర్ సాయిహితేష్ మాట్లాడుతూ నెల రోజుల పాటు విద్యార్థులకు ఉచితంగా స్పోకెన్ ఇంగ్లీషు తరగతులతో పాటు వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించామన్నారు. విద్యార్థుల సమస్యలే కాకుండా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు చిన్నప్పటి నుంచి విద్యతో పాటు నైతిక విలువలు నేర్పించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుత్తా హరిక్రిష్ణ, ఆర్ఎస్ఎస్ విభాగ్ సహ కార్యవాహ రెడ్డప్ప, సాయిప్రకాష్‌రెడ్డి, గౌతమ్, గిరీష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇంగ్లీషు తరగతుల్లోప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



పీలేరులో మెగా యోగాంధ్ర శిక్షణ కార్యక్రమంలో అధికారులు, ప్రజలు



కేవీపల్లె: మెగా యోగాంధ్ర శిక్షణ కార్యక్రమంలో అధికారులు

పీలేరు రూరల్ : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని తహసీల్దార్ ఎం. భీమేశ్వర్‌రావు, ఎంపీడీవో జి. శివశంకర్ అన్నారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యోగ శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా యోగంధ్ర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగ శిక్షణ కార్యక్రమం నెల రోజుల పాటు ఉంటుందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవోలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి, ఈవోపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్, షీ దివ్యయోగ అధ్యక్షురాలు డాక్టర్ పి.వి.ఎస్. లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కేవీపల్లె : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నెల రోజుల పాటు నిర్వహిస్తున్న యోగాంధ్ర శిక్షణ కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నరేంద్ర కుమార్, ఎంపీడీఓ సుధాకర్ అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో యోగా యోగాంధ్ర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగాతో శారీరక మానసికోల్లాసం లభిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయడం అలవర్చుకోవాలని కోరారు. ప్రభుత్వం ఉద్యోగులు ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంతంగా విధి నిర్వహణ చేయుటకు యోగా దోహదం చేస్తుందని తెలిపారు.

మహిళపై దాడిచేసిన ఐదుగురిపై కేసు

కలకడ : కులం పేరుతో దూషించి, కొట్టి గాపరిచినట్లు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజినేయులు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలి ఉన్నాయి. మండలంలోని గుడిబండ పంచాయతీ తెట్టు గ్రామానికి చెందిన కిల్లా శ్రీనివాసులు భార్య ఈశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన లోకేష్‌రెడ్డి, సుబ్బారెడ్డి, శివారెడ్డి, రమాదేవి, పార్వతమ్మ దుర్భాషలాడి, దాడి చేసి గాయపరిచినట్లు బాధితురాలు పేర్కొంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కనుల పండువగా ద్రౌపది కల్యాణం



ద్రౌపది కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

పీలేరు రూరల్ : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిర్వహిస్తున్న పంచమవేద మహాభారత యజ్ఞంలో భాగంగా బుధవారం ద్రౌపది కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం మహాభారత యజ్ఞం వద్ద ద్రౌపది అమ్మవారు, పంచ పాండవుల విగ్రహాలను వధూవరులుగా అలంకరించారు. మంగళవాయిద్యాల నడుమ, వేదమంత్రాలతో ద్రౌపది కల్యాణం కమనీయంగా నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో అమ్మవారికి మాంగళ్య దారణ కార్యక్రమం చేపట్టారు. ఉభయదారులు శివ గణేష్ గ్రూప్స్ యజమానులు భక్తిశ్రద్ధలతో కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం భాగవతారిణి జ్యోత్స్న ద్రౌపది కల్యాణం ఘట్టంపై హరికథా గానం చేశారు. రాత్రి ద్రౌపతి కల్యాణం నాటకం ప్రదర్శించారు.

కూటమి ప్రభుత్వంలో

దళితులు, మైనార్టీలపై దాడులు తీవ్రం

- తెనాలిలో నడిరోడ్డుపై బహిరంగ శిక్ష దారుణం
- ముమ్మాటికీ మానవహక్కుల ఉల్లంఘన
- మాలమహానాడు జాతీయ అధ్యక్షులు యమలా సుదర్శనం



మాట్లాడుతున్న మాలమహానాడు జాతీయఅధ్యక్షులు యమలాసుదర్శనం

మదనపల్లె రూరల్ : టీడీపీ కూటమి ప్రభుత్వంలో దళితులు, మైనారిటీలపై దాడులు తీవ్రమయ్యాయనేందుకు గుంటూరుజిల్లా తెనాలిలో నడిరోడ్డుపై యువకులను పోలీసులు కొట్టడమే నిదర్శనమని మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం తెలిపారు. బుధవారం స్థానిక మాలమహానాడు కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ఇటీవలి కాలంలో రాష్ట్రంలో రోజూ దళితులు, మైనారిటీలపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని, తెనాలి ఘటనే ఇందుకు పరాకాష్ట అని ప్రభుత్వ పనితీరును విమర్శించారు. మంత్రులు, ఎమ్మెల్యేల కుమారులు తప్పుచేస్తే ఈ విధంగా బహిరంగంగా శిక్షిస్తారా అని ప్రశ్నించారు. యువకులపై అతి కిరాతకంగా దాడిచేసిన పోలీసు అధికారులను కఠినంగా శిక్షించి, తక్షణమే సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళిత యువకులపై పోలీసుల పాశవిక చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం శ్రుతిమించి అమలు చేస్తున్నారని, నడిరోడ్డుపై కర్రలు విరిగేదాకా పోలీసులు కొట్టడం చూస్తుంటే సభ్యసమాజం తలదించుకునేలా పోలీసుల తీరు ఉందన్నారు. తెనాలి ఘటనపై హోం మంత్రి బాధ్యత వహించాలని, తక్షణమే ఘటనకు బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మాల మహానాడు నాయకులు గుండామనోహర్, యమలాచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి



రోడ్డు ప్రమాదంలో గాయపడిన నవీన్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

పెద్దతిప్పసముద్రం: తంబళ్ళపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి బుధవారం వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులతో కలసి మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండలంలోని కమ్మచెరువు పంచాయతీ మొరుసుపల్లిలో గుండెపోటుతో మృతి చెందిన మల్‌రెడ్డి అంత్యక్రియల్లో ఎమ్మెల్యే పాల్గొని కుటుంబీకులను ఓదార్చారు. టి.సదుం పంచాయతీ గుంటిపల్లికి చెందిన నవీన్ అనే యువకుడు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. అతడిని పరామర్శించారు. ఇదే పంచాయతీలో అనారోగ్యం కారణంగా ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చిన నరసింహప్పను పరామర్శించారు. నవాబుకోట పంచాయతీ వరికసువుపల్లికి చెందిన సుధాకర్‌రెడ్డి కుమారుడు పురిషిత్ రెడ్డి (14) రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తుమ్మరకుంట పంచాయతీ బురదలోల్లపల్లికి చెందిన గంగిరెడ్డి కుమారుడు రాహుల్‌రెడ్డి (24) అనే యువ రైతు వ్యవసాయం చేసి తీవ్రంగా నష్టాలు రావడంతో జీవితంపై విరక్తి పెంచుకుని గడ్డి మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం పాఠకులకు తెలిసిందే. ఆ బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే వెళ్లి మృతుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం పార్టీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలతో సమావేశమై మండలంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారన్నారు.

12న గృహ ప్రవేశాలకు సిద్ధం చేయండి

హౌసింగ్ పీడీ సాంబశివయ్య



అధికారులతో సమీక్షిస్తున్న పీడీ సాంబశివయ్య

మదనపల్లె: జిల్లాలో కూటమి ప్రభుత్వం వచ్చాక పూర్తయిన ఇళ్లను ప్రారంభోత్సవాలకు అధికారులు సిద్ధం కావాలని జిల్లా గృహ నిర్మాణశాఖ పీడీ సాంబశివయ్య అన్నారు. బుధవారం స్థానిక ఈఈ కార్యాలయంలో డివిజన్‌కు చెందిన హౌసింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండలాల వారీగా చేపట్టిన గృహాలు, నిర్మాణంలోని ఇళ్ల స్థితిని సమీక్షించారు. జూన్ 12 నాటికి ఎన్ని గృహాలు పూర్తవుతాయి, వాటిలో ప్రారంభించాల్సిన గృహాలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఇళ్ల నిర్మాణ పూర్తి లక్ష్యాలను సమీక్షించి ఇచ్చిన లక్ష్యాల మేరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించాలని ఆదేశించారు. ల బ్ధిదారుల ఇళ్ల నిర్మాణ బిల్లుల చెల్లింపునకు ఎలాంటి ఇబ్బందులు లేవని, పనులు అయిన వెంటనే బిల్లులు చెల్లించడం జరుగుతుందని చెప్పారు. ఎస్సీ, బీసీలకు పెంచిన ఇళ్ల విలువ మేరకు బిల్లులు ఇస్తామని చెప్పారు. ఈ గృహాల పూర్తికి ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఈఈ రమేష్‌రెడ్డి, తంబళ్లపల్లె డీఈఈ వెంకటరెడ్డి, పీలేరు డీఈఈ రమణయ్య, ఏఈలు దీనదయాళ్‌రాజు, ఈశ్వర్‌రెడ్డి, వర్క్ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

ఫారమ్‌పాండ్ ఉపయోగంపై అవగాహన

-ఏపీడీ నందకుమార్‌రెడ్డి

తంబళ్లపల్లె: మండలంలోని రైతులకు పొలాల్లో ఫారంపాండ్ ఏర్పాటు చేసుకుంటే కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని ఏపీడీ నందకుమార్‌రెడ్డి ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన తంబళ్లపల్లెలో పర్యటించారు. ఫారమ్‌పాండ్ నిర్మాణపు పనులను పరిశీలించారు. కూలీలతో ముఖాముఖీ, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్త్రీశక్తిభవనంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో 499 ఫారమ్ పాండ్‌ల నిర్మాణాలు టార్గెట్ ఇవ్వగా ఇప్పటి వరకు 187 మాత్రమే పూర్తి చేయడం ఏమిటని ఉపాధి సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. జూన్ నెలాఖరుకు టార్గెట్‌లు పూర్తి చేసేందుకు మండల టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు సమష్టిగా కృషి చేయాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ పనిలో పాల్గొనే విధంగా ప్రోత్సహించి కూలీల సంఖ్య పెంచాలన్నారు. రైతులకు పండ్లతోటలు, పూలతోటలు, పశుగ్రాసం పెంచుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఏపీఓ అంజనప్ప, జెఈ మహేష్, టెక్నికల్,ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సినిమా థియేటర్లలో తనిఖీలు



మదనపల్లె: రవి థియేటర్‌లో తనిఖీలు చేస్తున్న తహసీల్దార్ ధనుంజయులు



పీలేరులో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ భీమేశ్వర్‌రావు

మదనపల్లె రూరల్ : డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో సినిమా థియేటర్లలో రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని సిద్ధార్థ, మినీ సిద్ధార్థ, సాయిచిత్ర, రవి, సునీల్, ఏఎస్ఆర్, శ్రీకృష్ణ థియేటర్లలో తహసీల్దార్ ధనంజయులు, ఆర్ఐ భరత్‌రెడ్డి...వీఆర్వోలతో కలిసి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. థియేటర్లలోని వసతులు, మరుగుదొడ్ల నిర్వహణ, క్యాంటీన్ ధరలను పరిశీలించారు. థియేటర్ యాజమాన్యాలతో ప్రజలకు కల్పించాల్సిన వసతులపై చర్చించారు.

పీలేరులో

పీలేరు రూరల్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు పీలేరు పట్టణంలోని జీవీ సీఎస్ఆర్, సీఎస్ఎన్, ఎస్వీ మహల్ సినిమా థియేటర్లను బుధవారం తహశీల్దార్‌భీమేశ్వర్‌రావు తన సిబ్బందితో తనిఖీ చేశారు. క్షుణ్ణంగా రికార్డులు, థియేటర్లలో వసతులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సినిమా థియేటర్ల లైసెన్సులు, సిట్టింగ్ కెపాసిటీ, మరుగుదొడ్లు, క్యాంటిన్లు, వస్తువుల ధరలు, టికెట్ల ధరలపై ఆరా తీసినట్లు తెలిపారు. నివేదిక ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు సిద్ధయ్య, రెడ్డిశేఖర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట: స్థానిక సినిమా థియోటర్లలో బుధవారం తహసీల్దార్ మొహమ్మద్ అజారుద్దీన్, సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. దుకాణాల నిర్వహణ, సినిమా ప్రదర్శనలకు లైసెన్సులపై విచారణ జరిపారు. కొన్నింటికి లైసెన్సులు లేవని గుర్తించి వాటికి అనుమతులు తీసుకోవాలని యజమానులకు సూచించారు. నిబంధనలు పాటించాలన్నారు.

వైభవంగా కల్యాణోత్సవ వేడుక

బి.కొత్తకోట: మండలంలోని గట్టులో వెలిసిన శ్రీప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వివిధ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించాక, స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. తర్వాత స్వామి ఉత్సవ విగ్రహన్ని రథంలో కొలువుదీర్చి పూజలు చేశాక భక్తులకు హారతి ఇచ్చారు. భక్తులు గోవింద నామస్మరణతో రథాన్ని లాగుతూ తిప్పారు. అనంతరం స్వామి కళ్యాణోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు.